జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 40 ‖ గురువారం ‖ 9-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

09 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి నవమి ఉ. 10:34 వరకు తరువాత దశమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం అశ్విని మ. 2:50 వరకు తరువాత భరణి యోగం సుకర్మ ఉ. 10:06 వరకు కరణం గరజి ఉ. 10:34 వరకు వనిజ రా. 9:26 వరకు వర్జ్యం ఉ. 11:06 నుండి మ. 12:38 వరకు దుర్ముహూర్తం ఉ. 10:11 నుండి ఉ. 11:03 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం మ. 1:58 నుండి మ. 3:36 వరకు యమగండం తె. 5:51 నుండి ఉ. 7:29 వరకు గుళికాకాలం ఉ. 9:06 నుండి ఉ. 10:43 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు ఉ. 8:02 నుండి ఉ. 9:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## గోదావరి లోయలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

గోదావరి లోయ బొగ్గు గనుల పరిధిలో మిగిలి ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కే కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖను కోరారు.

హైదరాబాద్, జూలై 8 : బుధవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే ఈ ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాల నిర్వహణకు చట్టబద్ధమైన హక్కు ఉందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వా నికి పలు మార్లు లేఖల ద్వారా తెలియజేశామని చెప్పారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి నిజంగా సింగరేణి పట్ల చిత్తశుద్ధి ఉంటే గోదావరి లోయలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్త గా కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని భట్టి విక్రమార్క విమర్శించారు. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను ఇప్పటికే 2013లోనే సింగరేణికి కేటాయించారని, ప్రస్తుతం కేంద్ర బొగ్గు శాఖ ఇచ్చింది కొత్త కేటాయింపు కాదని, మైనింగ్ (మిగతా 2వ పేజీలో)



## గ్రీన్ గ్రోత్, ఏఐ, భవిష్యత్ పెట్టుబడులపై సీఎంతో అంతర్జాతీయ ప్రతినిధుల చర్చ

హైదరాబాద్, జూలై 8 : గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్--2026లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన మలేషియా పార్లమెంట్ సభ్యుడు డా. ఎం. శరవణన్ గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమ్మిట్‌లో పాల్గొన్న పలువురు అంతర్జాతీయ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రిని కలిసి తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, గ్రీన్ గ్రోత్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, పరిపాలనా సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, భవిష్యత్ పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధుల్లో నిలి గిల్బర్ట్ (అమెరికా), మహేష్ కొండూరు, (మిగతా 2వ పేజీలో)



## ఆయిల్ పామ్ విస్తరణకు ఊతం..


### గోద్రెజ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ప్రాసెసింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి బుధవారం గోద్రెజ్ అగ్రోవెట్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ భేటీలో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రెజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి పాల్గొన్నారు.

హైదరాబాద్, జూలై 8 : గోద్రెజ్ అగ్రోవెట్ ఆధ్వర్యం లో రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సంబంధించిన నివేదికను సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి అందజేశారు. తెలంగా ణలో తొలి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు కీలక అంశాలపై సమావేశం లో చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ. 300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ సమీకృత ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు నర్సరీ, పరిశోధన--అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రం, సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇప్పటికే గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థకు కేటాయిం చింది. అదనంగా సీడ్ గార్డెన్ అభివృద్ధి కోసం మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని (మిగతా 2వ పేజీలో)

## వైఎస్సార్‌కు సీఎం రేవంత్ నివాళి

### సంక్షేమ సేవలు చిరస్మరణీయం



ఉమ్మడి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని వైఎస్సార్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, రాజ్ ఠాగూర్ తదితరులు పాల్గొని వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.

హైదరాబాద్, జూలై 8 : ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో గణనీయ మైన మార్పు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. నిరుపేదలకు అందించిన సేవలు, ప్రజా సంక్షేమానికి ఆయన చూపిన మార్గం చిరస్మరణీయమని, ప్రజల మనసుల్లో వైఎస్సార్ పేరు చిరకాలం నిలిచి ఉంటుందని కొనియాడారు. తరువాయి 2 వ పేజీలో...



## ఉద్యోగార్థులు కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా ఎదగండి

### ఇంజినీరింగ్ పట్టభద్రులకు గవర్నర్ పిలుపు

హైదరాబాద్, జూలై 8: ఇంజినీరింగ్ పట్టభద్రులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. దేశ ప్రగతి యువత సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలపైనే ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ఆరో గ్రాడ్యుయేషన్ డే (పట్టాభిషేక) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని గవర్నర్ ప్రసంగించారు. పట్టా ప్రదానోత్సవం అనేది కేవలం డిగ్రీలు అందుకునే వేడుక మాత్రమే కాకుండా, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన జీవితకాల బాధ్యతకు నాంది తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణలో భూదోపిడీ

### రాజకీయ ఆధిపత్యంపై తీన్మార్ మల్లన్న సంచలన ఆరోపణలు

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న తెలంగాణలో భూయాజమా న్యం, రాజకీయ ఆధిపత్యం, ప్రభుత్వ వ్యవసాయ పథకాల అమలుపై సంచలన ఆరోపణలు చేశారు. "నిజాం వదిలిపెట్టిన తెలంగాణ" పేరిట విడుదల చేసిన వివరాల్లో చారిత్రక పత్రాలు, గణాంకాలు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా భూదోపిడీ జరిగిందని ఆయన ఆరోపించారు.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మిశ్రమ వాతావరణం ఉంటుంది. కొన్ని పరిస్థితులు ఇబ్బందిపెడతాయి. చంచలబుద్ధితో వ్యవహరించి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు. గోసేవ మంచి ఫలితాలను ఇస్తుంది.

**వృషభం :** బలమైన సంకల్పంతో పనిచేయాలి. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తవుతాయి. ఒక శుభవార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మీ ప్రతిభను పెద్దలు ప్రశంసిస్తారు. అవసరాలకు డబ్బు అందుతుంది. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆదిత్య హృదయ పారాయణ శుభప్రదం.

**మిథునం :** ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారు. కీలక అంశాల్లో పెద్దలను సంప్రదించడం ఉత్తమం. రుణ సమస్యలు తగ్గుతాయి. ఇష్టదేవతా ఆరాధన శుభప్రదం.

**కర్కాటకం :** గ్రహబలం మిశ్రమంగా ఉంది. మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి. ప్రారంభించబోయే పనిలో ఉత్సాహంగా ముందుకు సాగాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తారు. మీ కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. ముఖ్యమైన కార్యక్రమంలో బంధుమిత్రులను కలుపుకొనిపోవడం మేలు. నవగ్రహ స్తోత్రం చదివితే బాగుంటుంది.

**సింహం :** ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది. బంధుమిత్రులతో కలిసి చేసే పనులు సత్ఫలితాన్ని ఇస్తాయి. ఒక ముఖ్య వ్యవహారంలో మీరు ఆశించిన పురోగతి ఉంటుంది. ఆదిత్య హృదయం పఠించాలి.

**కన్య :** ప్రారంభించబోయే పనుల్లో శ్రమ పెరుగుతుంది. ఆత్మీయుల సహాయ సహకారాలు మేలు చేస్తాయి. శత్రువులు మిత్రులు అవుతారు. ముఖ్యమైన కొనుగోళ్లు చేస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి సందర్శనం శక్తిని ఇస్తుంది.

**తుల :** ఉద్యోగ, వ్యాపారపరంగా అనుకూలత ఉంది. తోటివారితో ఆనందంగా గడుపుతారు. బంధుమిత్రులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. కీలకమైన చర్చలు ఫలిస్తాయి. ఇష్టదైవ ధ్యానం శుభప్రదం.

**వృశ్చికం :** శుభ భవిష్యత్తు కనిపిస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాల్లో గొప్ప ఫలితాలు ఉన్నాయి. ఒక శుభవార్త మీ మనోధైర్యాన్ని పెంచుతుంది. సూర్యారాధన మేలు చేస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితం ఉంటుంది. ఒక వ్యవహారంలో తోటివారి సాయం అందుతుంది. శుభ కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరానికి డబ్బు అందుతుంది. ఆదిత్య హృదయం పఠించాలి.

**మకరం :** మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. కీలక విషయాల్లో తోటివారి సలహాలు తప్పనిసరి. కొందరి ప్రవర్తన మీకు ఇబ్బంది కలిగిస్తుంది. శత్రువులతో జాగ్రత్త. సమయాన్ని వృథా చేయకండి. నవగ్రహ ఆరాధన శుభప్రదం.

**కుంభం :** పనులకు ఆటంకాలు కలుగకుండా చూసుకోవాలి. మనోబలం తగ్గకుండా చూసుకోవాలి. ఓర్పు చాలా అవసరం. అనవసర భయాందోళనలను దరిచేరనీయకండి. నవగ్రహ ధ్యాన శ్లోకం చదివితే మంచిది.

**మీనం :** కాలం అనుకూలిస్తోంది. మనోధైర్యంతో అనుకున్నది సాధిస్తారు. ఒక పనిలో అధికారుల నుంచి మీకు ప్రశంసలు లభిస్తాయి. అర్థ, వస్త్ర లాభాలు ఉన్నాయి. ఇష్టదేవతా శ్లోకాలు చదివితే బాగుంటుంది.





# సింగరేణికే కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

లీజు అనుమతి మాత్రమేనని స్పష్టం చేశారు. 2013లో కేటాయించిన బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరును కేంద్ర ప్రభుత్వం ఇంతకాలం పెండింగ్‌లో ఉంచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై నిరంతరం కేంద్రానికి లేఖలు రాసి, ఒత్తిడి తీసుకురావడంతోనే ఇప్పుడు లీజు మంజూరైందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగానే కేంద్రం మైనింగ్ లీజుకు ఆమోదం తెలిపిందని భట్టి పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు సంస్థలకు కేటాయించిన కొయ్యగూడెం--3 ఓపెన్‌కాస్ట్ బ్లాక్ మరియు సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్--3 బ్లాక్లో ఇప్పటివరకు తవ్వకాలు ప్రారంభం కాలేదని, ఆ బ్లాకులను వెంటనే వెనక్కి తీసుకుని సింగరేణికి అప్పగించాలని కేంద్రాన్ని కోరారు.

గోదావరి లోయ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా నేరుగా సింగరేణికే కేటాయించాలని, గిరిజన చట్టాలు, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం-ప్రభుత్వం (జీ2జీ) విధానంలో ఈ కేటాయింపులు జరపాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

ఈ మీడియా సమావేశంలో సింగరేణి చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతమ్ పోత్రు తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ విస్తరణకు ఊతం..

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ప్రాసెసింగ్ మిల్‌కు రాకపోకలు సులభతరం చేసేందుకు రహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేయగా, టీజీఐఐసీ ఆధ్వర్యంలో అవసరమైన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### గ్రీన్ గ్రోత్, ఏఐ, భవిష్యత్ పెట్టుబడులపై

## సీఎంతో అంతర్జాతీయ ప్రతినిధుల చర్చ

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా ప్రభుత్వ క్రిటికల్ మినరల్స్ సలహాదారు, అమిత్ మెహ్రా (యూకే), దిలెక్, థామస్ ఫ్రోలిక్, సెంథిల్ తొండమాన్ తదితరులు ఉన్నారు. తెలంగాణను సుస్థిర అభివృద్ధి, హరిత ఆర్థిక వ్యవస్థ, ఆధునిక సాంకేతికతల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వారికి వివరించగా, భవిష్యత్‌లో పరస్పర సహకారం, పెట్టుబడుల విస్తరణకు సంబంధించి సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం.

## తెలంగాణలో భూదోపిడీ

తాను వెల్లడించిన లెక్కల్లో ఒక్క అంకె తప్పయినా ఏ రాజకీయ నాయకుడైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

హైదరాబాద్, జూలై 8 తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు కనీసం రెండు ఎకరాల భూమి పంపిణీ చేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ఎలా అమలు చేస్తామో ఈ నివేదిక ద్వారా వివరించామని ఆయన తెలిపారు. 1927లో నిజాం(మిగతా 2వ పేజీలో) ప్రభుత్వం వెట్టిచాకిరి నిర్మూలనకు చర్యలు తీసుకుందని, 1945లో కౌలుదారులకు శాశ్వత సాగు హక్కులు కల్పించే చట్టాలు తీసుకొచ్చిందని మల్లన్న పేర్కొన్నారు.

అలాగే 1949 ఆగస్టు 15న జారీ చేసిన ఫర్మానా ద్వారా జాగీర్ల వ్యవస్థను రద్దు చేసి, సుమారు కోటి ఎకరాల భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చి జాగీర్దారులకు రూ.18 కోట్ల పరిహారం చెల్లించిందని చెప్పారు. ఈ విషయాలకు పాఠ్యపుస్తకాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

### కాస్రా పహానీతో భూముల పునర్విభజన జరిగిందని ఆరోపణ

రాష్ట్ర ఏర్పాటు అనంతరం రెవెన్యూ వ్యవస్థలో జరిగిన మార్పుల ద్వారా నిజాం ఫర్మానా అమలును నిర్వీర్యం చేశారని, 1954-55లో రూపొందించిన కాస్రా పహానీ ఆధారంగా అప్పటికే పరిహారం పొందిన జాగీర్దారులకు మళ్లీ భూములపై యాజమాన్య హక్కులు కల్పించారని మల్లన్న ఆరోపించారు. అప్పటి నుంచి రెవెన్యూ వ్యవస్థ కొద్ది వర్గాల ఆధిపత్యంలో కొనసాగుతోందని విమర్శించారు.

### భూ సీలింగ్ చట్టం అమలును అడ్డుకున్నారని విమర్శ

మాజీ ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు తీసుకురావాలనుకున్న భూ గరిష్ట పరిమితి చట్టాన్ని అమలు కాకుండా అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ అంశాలకు సంబంధించి అప్పటి అసెంబ్లీ చర్చలు, చారిత్రక రికార్డులను ప్రస్తావిస్తూ భూసంస్కరణలు పూర్తిగా అమలు కాలేదన్నారు.



## కెనడా-తెలంగాణ భాగస్వామ్యానికి కొత్త ఊపు

### రేవంత్‌తో కెనడా హైకమిషనర్ భేటీ

### కెనడా పర్యటనకు ఆహ్వానం

### గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం

హైదరాబాద్, జూలై 8 తెలంగాణకు విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత విస్తరించే దిశగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ--కెనడా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, మౌలిక సదుపాయాల రంగాల్లో సహకారాన్ని విస్తరించే అంశాలపై విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు రావాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ అధికారికంగా ఆహ్వానించారు. అలాగే ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలకు సీఎం ఆహ్వానం పలికారు.

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్య అవకాశాలపై ఇరువురు ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

తెలంగాణ ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ ఫార్చ్యూన్-500 సంస్థల గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని సీఎం వివరించారు. ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రముఖ కెనడియన్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో మల్టీ-యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

ఈ సందర్భంగా హైకమిషనర్ క్రిస్ కూటర్ మాట్లాడుతూ, ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్, సీఐబీసీ, సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి కెనడా సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్రంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని ప్రశంసించారు.

రాబోయే నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం

## ఉద్యోగార్థులు కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా ఎదగండి

మొదటి పేజీ తరువాయి

అని ఆయన అన్నారు.

'వికసిత్ భారత్--2047' లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందించాలని సూచించారు.

హైదరాబాద్ దేశంలోనే సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఏరోస్పేస్, బయోఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్న గవర్నర్, యువత తమ లక్ష్యాలను సాకారం చేసుకునేందుకు నగరం అత్యుత్తమ అవకాశాలను కల్పిస్తోందన్నారు.

విద్యకు విలువలు, నైతికత, క్రమశిక్షణ తోడైతేనే అది సంపూర్ణమవుతుందని పేర్కొన్న ఆయన, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, 'నషా ముక్త్ భారత్' లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలని యువతకు పిలుపునిచ్చారు. 2026 సంవత్సరానికి చెందిన పట్టభద్రులందరికీ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, వారు తమ కుటుంబాలకు, విద్యాసంస్థకు, తెలంగాణకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శ్వేత

# సంపాదకీయం

గురువారం 9-7-2026

## కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా ?

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం.

అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్దంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్దిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు.

నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.



## వాన బీభత్సం

### మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

### ఢిల్లీకి ఐఎండీ రెడ్ అలర్ట్

ముంబయి/పుణె, జులై 08: మహారాష్ట్రను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ క్రమంలో పుణె జిల్లా పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న ఓ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంటులో మూడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో శిథిలాల కింద సుమారు 15 మంది ఉద్యోగులు చిక్కుకున్నట్లు అధికారులు అంచనా వేస్తుండగా, రంగంలోకి దిగిన అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. వారం రోజులుగా పుణె, పింప్రి-చించ్వాడ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ముప్పు పెరగడంతో, లోతట్టు మరియు వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మందిని అధికారులు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా పలు ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలను తాత్కాలికంగా మూసివేశారు.మరోవైపు, రాజధాని ముంబయి సహా దాని పరిసర ప్రాంతాలను సైతం భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నగరానికి తాగునీరు అందించే ఏడు ప్రధాన సరస్సుల్లోకి భారీగా వరద నీరు వస్తుండటంతో, వాటిలో చిన్నవైన తులసి, విహార్ సరస్సులు మంగళవారం రాత్రి నుంచే పొంగిపొర్లుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై భారీగా నీరు నిలిచి జనజీవనం స్తంభించడమే కాకుండా పశ్చిమ రైల్వేలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంబయితో పాటు థానే, పాల్ఘర్, రాయగఢ్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిస్తూ ప్రజలను అప్రమత్తం చేసింది. జులై 9 నుంచి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టి, 12 నుంచి చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఇదిలా ఉండగా, రాబోయే కొద్ది గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున దేశ రాజధాని దిల్లీకి సైతం వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది మరియు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుండి బయటకు రావద్దని గట్టిగా సూచించింది.



## నియోజకవర్గ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించండి

### కలెక్టర్‌కు ఎమ్మెల్యే కన్నా వినతి

నర్సరావుపేట, జూలై 08: తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై ఆయన కలెక్టర్‌తో కూలంకషంగా చర్చించారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని నియోజకవర్గానికి చెందిన పలు స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.


విదేశీ విద్యలో యూకేకు పెరుగుతున్న ఆదరణ...

## భారతీయ విద్యార్థులు ఎందుకు ఆసక్తి చూపుతున్నారు?

ప్రత్యేక కథనం

ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో ఉన్నత విద్యకు అంతర్జాతీయ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. నాణ్యమైన విద్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందాలనే లక్ష్యంతో భారతీయ విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్ (UK) ప్రముఖ విద్యా గమ్యస్థానంగా నిలుస్తోంది.

ప్రపంచంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలకు నిలయమైన యూకే, విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఆధునిక బోధనా విధానాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడి విద్యా విధానం కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించేలా రూపొందించబడింది.

యూకేలో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డిగ్రీలు లభిస్తాయి. తక్కువ కాలంలో కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, చదువుతో పాటు పార్ట్-టైమ్ ఉద్యోగాలు చేసే వెసులుబాటు కూడా ఉంది. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలను అన్వేషించేందుకు అందుబాటులో ఉన్న +త్థుఒబఖ్వ =శీబ్వ వంటి అవకాశాలు కూడా విద్యార్థులకు అదనపు ప్రయోజనంగా మారుతున్నాయి.

విద్యతో పాటు విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి చదివే అవకాశం ఉండటం వల్ల అంతర్జాతీయ అనుభవం, సాంస్కృతిక అవగాహన మరియు ప్రపంచ దృక్పథం పెరుగుతాయి. ఇవి భవిష్యత్ కెరీర్ అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అయితే విదేశీ విద్య కోసం సరైన విశ్వవిద్యాలయం ఎంపిక, కోర్సు ఎంపిక, ప్రవేశ ప్రక్రియ, డాక్యుమెంటేషన్, స్కాలర్‌షిప్ అవకాశాలు, విద్యార్థి వీసా వంటి అంశాలపై పూర్తి అవగాహన ఉండటం అవసరం. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే విదేశీ విద్య ప్రయాణం మరింత సులభమవుతుంది.

ఈ దిశగా EXXEELLA Educational Group విద్యార్థులకు సమగ్ర మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. అర్హతలకు అనుగుణంగా యూనివర్సిటీలు, కోర్సుల ఎంపిక నుంచి అడ్మిషన్ ప్రక్రియ, ుూ్రా తయారీ, డాక్యుమెంటేషన్, వీసా ఫైలింగ్, ప్రీ-డిపార్చర్ గైడెన్స్ వరకు ప్రతి దశలో నిపుణుల సేవలను అందిస్తూ విద్యార్థుల విదేశీ విద్య ప్రయాణానికి తోడ్పడుతోంది. విదేశీ విద్యను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని, నిపుణుల సలహాలతో సరైన నిర్ణయాలు తీసుకుంటే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

మరిన్ని వివరాలకు

EXXEELLA
Educational Group

Study in UK Admissions
Scholarships Student
Visa Assistance

Your Global
Education Partner



...సంప్రదించండి....

Bhanu Sairam Arepu
9100749422
applications@exxeella.com

## ప్రియురాలితో పారిపోయిన భర్త.. భార్య ఎదుటే పురుగుల మందు తాగిన జంట

**హైదరాబాద్, జూలై 8**



వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇంటి నుంచి ప్రియురాలితో కలిసి వెళ్లిపోయిన భర్తను తిరిగి ఇంటికి తీసు కొస్తుండగా, భార్య కళ్ల ముందే భర్త, అతని ప్రియురాలు పురుగుల మందు తాగిన ఘటన హైదరాబాద్ సమీపంలోని చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సంచలనం సృష్టించింది. పోలీసుల వివరాల ప్రకారం, వివాహిత వ్యక్తి కొంతకాలంగా మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ ఇటీవల ఆమెతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు వారిని గుర్తించి ఇంటికి తీసు కువస్తుండగా, సబరి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరూ అకస్మాత్తుగా తమ వద్ద ఉన్న పురుగుల మందు తాగారు. ఈ దృశ్యాన్ని చూసి భార్యతో పాటు ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే రైల్వే సిబ్బంది, సహ ప్రయాణికులు స్పందించి ఇద్దరినీ చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో దించి సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. వారి ఆరోగ్య పరిస్థితిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నాయి.

## ఉబెర్ బైక్ డ్రైవర్ అరెస్ట్.. రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, స్కూటర్ స్వాధీనం



హైదరాబాద్, జూలై 8 : మసాబ్‌ట్యాంక్‌లోని ఓ ఇంట్లో రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేసిన కేసులో మెహిదీపట్నం పోలీసులు ఉబెర్ బైక్ డ్రైవర్ బియ్య శశిధర్ (28)ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, హోండా యాక్టివా స్కూటర్, నగదును స్వాధీనం చేసుకున్నారు. న్యూ బోయిన్‌పల్లికి చెందిన నిందితుడిని ఇంటి చోరీ కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడి వద్ద నుంచి 157.8 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక హోండా యాక్టివా స్కూటర్, రూ.12,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 30న మసాబ్‌ట్యాంక్‌లోని సిరిప్రియ రెసిడెన్సీలో నివసించే రాజిత శ్రీనివాస్ గోదారి తన ఇంట్లోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. విచారణలో నిందితుడు బాధితురాలి మేనకోడలు ద్వారా ఆ కుటుంబానికి పరిచయం ఏర్పరుచుకుని, పలుమార్లు ఇంటికి వెళ్లి విలువైన వస్తువులు ఎక్కడ ఉంచుతున్నారో గమనించినట్లు పోలీసులు గుర్తించారు. తర్వాత కుటుంబానికి చెందిన కారును అమ్మేందుకు సహాయం చేస్తాననే నెపంతో ఇంటికి వెళ్లిన శశిధర్, ఇంట్లో అందుబాటులో ఉన్న తాళాలతో అల్మారాను తెరిచి బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వాటిని సికింద్రాబాద్ గోల్డ్ మార్కెట్‌లో విక్రయించి, వచ్చిన డబ్బులో కొంతతో గోవాకు వెళ్లి ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైంది. గోవా నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత అందిన విశ్వసనీయ సమాచారంతో మెహిదీపట్నం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ క్రైమ్ బృందం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రాంబాబు, ఎస్‌హెచ్‌ఓ ఎస్. మల్లేష్ ఆధ్వర్యంలో ఛేదించింది. ఏసీపీ కె. శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి, అదనపు డీసీపీ బి. శ్రీకృష్ణ గౌడ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని తగిన విధంగా సత్కరిస్తామని అధికారులు తెలిపారు.



## పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో వెంటనే ఉపాధ్యాయులు, ఆయాలను నియమించాలి:

**ఎస్ టి యు సూర్యపేట జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు డిమాండ్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ-ప్రైమరీ స్కూల్స్ - ఇంగ్లీష్ మీడియం) కేవలం ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయిందని, క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాల కల్పన కరువైందని ఇంతవరకు ప్రీ ప్రైమరీ స్కూల్స్ కి ఇన్స్ట్రక్టర్ ,ఆయాలను నియమించకపోవడం పట్ల ఎస్టీయూ సూర్యాపేట జిల్లాజు అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించడమే తప్ప, వాటి నిర్వహణకు కావాల్సిన ఉపాధ్యాయులను, ఆయాలను ఇప్పటివరకు నియమించకపోవడం తీవ్ర విచారకరమన్నారు. పాఠశాలల్లో చేరిన చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆయాలు, చదువు చెప్పడానికి ప్రత్యేక టీచర్లు లేకపోవడంతో, ఆ అదనపు భారం అంతా ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై పడుతోంది. దీనివల్ల ఇటు ప్రీ-ప్రైమరీ పిల్లలకు, అటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదు. పాఠశాలల్లో కనీస వసతులు, టీచర్లను ఆయాలను నియమించకపోవడం వల్ల తల్లిదండ్రులు, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుండి తిరిగి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే అవకాశం ఉంది. ఇది ప్రభుత్వ ఆశయానికి, ప్రభుత్వ విద్యారంగశీ బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి విఘాతం కలిగే విధంగా మారుతోంది. కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఆయాల నియామకంలో ఎటువంటి అవినీతికి, పైరవీలకు, రాజకీయ నాయకుల జోక్యానికి అవకాశం లేకుండా ప్రతిభకు పట్టం కట్టినప్పుడు మాత్రమే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది.

1. అన్ని ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) పాఠశాలల్లో తక్షణమే ప్రత్యేక ఉపాధ్యాయులనుళి, ఆయాలను నియమించాలి.
2. ఇంగ్లీష్ మీడియం బోధనకు అవసరమైన కనీస మౌలిక వసతులు, ఆట వస్తువులను వెంటనే సమకూర్చాలి.

ఇప్పటికైనా విద్యాశాఖ, ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టా లని ఎస్ టి యు సూర్యపేట జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.




## పుస్తకాలు వ్యక్తిత్వ వికాస సోపానాలు

**నకిరేకల్ జూలై 9**

పుస్తకాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదమే పడడమే కాకుండా విజ్ఞాన ప్రపంచంలోకి నడిపిస్తాయని మరో గ్రంథాలయఉద్యమం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో 'పుస్తకం ప్రాముఖ్యత' అనే అంశంపై జరిగిన సెమినార్లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్లో కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను తొలగించడంలో, ఆలోచన శక్తిని పెంపొందించడంలో పుస్తకాలు కీలకపాత్ర పోషిస్తాయి అన్నారు. పుస్తకాలు చదవడం ద్వారానే ఉన్నత వ్యక్తులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉన్న గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల గ్రంథాలయాలలోని పుస్తకాల ద్వారా అనేక కొత్త విషయాలను నేర్చుకోవచ్చు అన్నారు. మంచి పుస్తకం సంస్థ ద్వారా 200 గ్రంథాలను తాటికల్లు ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి కస్తూరి ప్రభాకర్ బహుకరించారు. సెమినార్ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, మోసంగి హరీష్ చంద్ర, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సర్వోత్తమ్ రెడ్డి



**సూర్యాపేట, జూలై 8**

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌస్‌లో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యలను నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, చేనేత రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, సంప్రదాయ వారసత్వానికి కీలకమని అన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రజలు మరింతగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. చేనేత ఉత్పత్తులు నాణ్యత, మన్నికతో పాటు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు నాగుల వాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గండూరి రమేష్, ఉపాధ్యక్షుడు చిలివేరు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముషం హరిప్రసాద్, డైరెక్టర్లు ముషం యాదమ్మ, విడం నీరజ, పెద్ది శ్రీనివాస్, యలగందుల లక్ష్మయ్య, యలగందుల సాయి నేత, మాజీ అధ్యక్షుడు కడారి బిక్షం, మాజీ కోశాధికారి బాల్నే మల్లయ్య, పట్టణ పద్మశాలి సంఘం నాయకుడు యలగందుల సుదర్శన్, దూలం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టి పోరాటం అవసరం

### తెలంగాణ ఈగల్ ఫోర్స్

**హైదరాబాద్, జూలై 8**




"నషా ముక్త్ భారత్" లక్ష్యాన్ని సాధించాలంటే చట్ట అమలు సంస్థలు, విద్యాసంస్థలు, సమాజం, ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో కేంద్ర సమాచార ప్రసార బ్యూరో (సీబీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" సమగ్ర సమాచార, అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై తెలంగాణ పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారని, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1908కు ప్రజలు అందిస్తున్న విశ్వసనీయ సమాచారంతో డ్రగ్ ముఠాలను గుర్తించి, విచారించి, ఛేదిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని, ముఖ్యంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్ మాఫియా పనిచేస్తోందని ఆయన హెచ్చరించారు. యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉందని ఆయన వివరించారు. డ్రగ్ అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, వ్యసనబారిన పడిన వారికి పునరావాసం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార బ్యూరో (పీఐబీ), సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీబీసీ కట్టుబడి ఉందన్నారు. మాదకద్రవ్యాల నివారణలో అవగాహన, ముందస్తు జాగ్రత్తలు, సరైన నిర్ణయాలు అత్యంత ప్రభావవంతమైన ఆయుధాలని, అదే సమయంలో వ్యసనబారిన పడిన వారికి గౌరవప్రదమైన పునరావాసం కల్పించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం, సైబర్ మోసాలు దేశ యువత ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సవాళ్లుగా మారాయని అన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ సహచరుల్లోనూ అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల మూల్యాంకన విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా, అధ్యాపకులు, విద్యార్థులు, సీబీసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐదు రాష్ట్రాల్లో 36 మంది సైబర్ నేరస్థుల అరెస్ట్

**హైదరాబాద్, జూలై 8**

హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ జూన్-2026 నెలలో ఐదు రాష్ట్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 36 మంది సైబర్ నేరస్థులను అరెస్టు చేసి, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు దాదాపు రూ.48.98 లక్షలను తిరిగి అందజేసింది. సైబర్ క్రైమ్ పోలీసులు విడుదల చేసిన నెలవారీ నివేదిక ప్రకారం, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (చీజ౹ా) ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా 52 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. పెట్టుబడి మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, వివాహ సంబంధిత మోసాలకు సంబంధించిన 14 కేసుల్లో ఈ అరెస్టులు జరిగాయి. అరెస్టయిన వారిలో 22 మంది పెట్టుబడి మోసాలకు, ఐదుగురు సోషల్ మీడియా మోసాలకు, ఆరుగురు వివాహ సంబంధిత మోసాలకు, ముగ్గురు ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో రూ.48.98 లక్షలను స్వాధీనం చేసుకుని బాధితులకు తిరిగి చెల్లించారు. ప్రధాన కేసుల్లో ఒకటైన ట్రేడింగ్ మోసంలో, వాట్సాప్ ద్వారా నకిలీ సంస్థాగత స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.22 కోట్లు మోసం చేసిన కేసులో నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, డెబిట్ కార్డులు, చెక్‌బుక్‌లు, సిమ్ కార్డులు, బ్యాంకు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. జోనల్ సైబర్ సెల్‌లు జూన్ నెలలో మొత్తం 2,288 ఎన్‌సీఆర్‌పీ ఫిర్యాదులను పరిశీలించి, 287 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశాయి. తొమ్మిది కేసుల్లో 10 మందిని అరెస్టు చేయడంతో పాటు రూ.1.08 కోట్లకు పైగా బాధితులకు తిరిగి అందజేశాయి. సైబర్ పెట్రోల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ అక్రమ ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘాను మరింత ముమ్మరం చేసింది. అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి పథకాలు, చిన్నారుల దోపిడీ, మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) మోసాలను ప్రోత్సహిస్తున్న 280 నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లతో పాటు 310 చెల్లింపు ప్రకటనలను గుర్తించి సంబంధిత సోషల్ మీడియా వేదికలకు నివేదించగా, వాటిని తొలగించారు. ఇప్పటివరకు సైబర్ పెట్రోల్ చర్యల ద్వారా మొత్తం 958 నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లు, 2,517 అక్రమ ప్రకటనలు తొలగించబడగా, నిర్వాహకులపై ఎనిమిది ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సైబర్ నేరాల బాధితులకు సహాయం అందించే సి-మిత్ర (జ-వీ×ు=ూా) కార్యక్రమం ద్వారా 1,247 మంది బాధితులను సంప్రదించి, వేగవంతమైన న్యాయపరమైన చర్యల కోసం 225 జీరో ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. నకిలీ పెట్టుబడి పథకాలు, వ్యక్తుల పేర్లతో మోసాలు, హానికరమైన ఏపీకే (ూూాఖ) ఫైళ్లు, ఫిషింగ్ లింకులు, వాట్సాప్ ప్రొఫైల్ క్లోనింగ్, మ్యాట్రిమోనియల్ మోసాలు, "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు.

## యూరియా బుకింగ్‌కు మీసేవ సేవలు.. రైతులకు మరింత సౌలభ్యం

**హైదరాబాద్, జూలై 8**

రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యూరియా పంపిణీలో పారదర్శకతను పెంచడంతో పాటు రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యవసాయశాఖ ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా, యాప్ వినియోగించలేని రైతుల సౌకర్యార్థం మీసేవ కేంద్రాల ద్వారా కూడా బుకింగ్ సదుపాయాన్ని ప్రారంభించారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ (ట్రాదీ) నంబర్‌తో సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించి, సాగు విస్తీర్ణం, పంట వివరాలను నమోదు చేయించుకోవాలి. అనంతరం తమకు అవసరమైన యూరియాను ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద బుక్ చేసుకోవచ్చు.రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటీపీని ధృవీకరించిన వెంటనే బుకింగ్ ఐడీ జారీ అవుతుంది. ఈ బుకింగ్ ఐడీ బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటల పాటు మాత్రమే చెల్లుబాటులో ఉంటుంది. ఆ గడువులోపు సంబంధిత ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.వ్యవసాయశాఖ సూచనల ప్రకారం, సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీసేవ కేంద్రాల ద్వారానే చేయాలి. ఓటీపీ అందేందుకు పట్టాదారు పాస్‌బుక్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా యాక్టివ్‌లో ఉండాలని అధికారులు తెలిపారు. మీసేవ కేంద్రాల్లో కేవలం రూ.10 నామమాత్రపు సేవా రుసుముతో ఈ సేవ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకుని అధికారిక బుకింగ్ విధానం ద్వారా సబ్సిడీ యూరియాను పొందాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## ప్రపంచ బ్యాంకు గుర్తింపు కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం: కేటీఆర్

**హైదరాబాద్, జూలై 8**

తెలంగాణను “అప్పర్-మిడిల్-ఇన్‌కమ్” (ఉన్నత మధ్య ఆదాయ) ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంకు గుర్తించడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, సమర్థ పాలనకు అంతర్జాతీయ గుర్తింపని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే . టీ . రామ రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.19 లక్షలు (5,407 అమెరికన్ డాలర్లు) నమోదవడంతో ప్రపంచ బ్యాంకు అప్పర్-మిడిల్-ఇన్‌కమ్ కేటగిరీలో చోటు దక్కించుకున్న దేశంలోని ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దశాబ్దకాలం పాటు అమలు చేసిన పరివర్తనాత్మక పాలన ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ , మిషన్ కాకతీయ, రైతు బంధు వంటి కార్యక్రమాల వల్ల పరిశ్రమల అభివృద్ధి, వ్యవసాయ పురోగతి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని, దీంతో తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభి వృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా ఎదిగిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## రూ.10 నాణేలతోనే రూ.1.10 లక్షల బైక్ కొనుగోలు..


### యాదాద్రిలో వినూత్న ఘటన

**యాదాద్రి భువనగిరి, జూలై 8**

సాధారణంగా కొత్త వాహనం కొనుగోలు చేసే సమయంలో నగదు, చెక్కు లేదా డిజిటల్ చెల్లింపులు చేస్తుంటారు. అయితే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ వ్యక్తి మాత్రం పూర్తిగా రూ.10 నాణేలతోనే రూ.1.10 లక్షల విలువైన కొత్త బైక్ కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఈ వినూత్న ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో చోటుచేసుకుంది. వెలిమినేడు గ్రామానికి చెందిన కొండె రఘుపతి చాలా కాలంగా కూడబెట్టిన రూ.10 నాణేలను బస్తాల్లో నింపుకుని చిట్యాలలోని శ్రీ వినాయక మోటార్స్ షోరూమ్‌కు వెళ్లాడు. అక్కడ హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను ఎంపిక చేసుకుని, మొత్తం రూ.1.10 లక్షల ధరను 11 వేల పది రూపాయల నాణేల రూపంలో చెల్లించాడు. ఒక్క సారిగా అంత పెద్ద మొత్తంలో నాణేలను చూసిన షోరూమ్ సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. నలుగురు ఉద్యోగులు కలిసి గంటలపాటు ఒక్కో నాణట్నన్ని లెక్కించి మొత్తం సరిచూసిన అనంతరం చెల్లింపును స్వీకరించారు. అనంతరం అన్ని ప్రక్రియలు పూర్తి చేసి రఘుపతికి కొత్త బైక్‌ను అందజేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది.



చట్టబద్ధమైన కరెన్సీ అయిన రూ.10 నాణేలతో కూడా భారీ మొత్తాల లావాదేవీలు చేయవచ్చని రఘుపతి తన చర్య ద్వారా నిరూపించారని పలువురు ప్రశంసిస్తున్నారు. అతని ఓర్పు, పొదుపు అలవాటు, వినూత్న ఆలోచనపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## భద్రతా తనిఖీల అనంతరం రోడ్డెక్కిన మరో 118 జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులు

**హైదరాబాద్, జూలై 8**

బ్యాటరీ భద్రతా సమస్యల నేపథ్యంలో నిలిపివేసిన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) దశలవారీగా తిరిగి సేవల్లోకి తీసుకొస్తోంది. కఠినమైన ఫిట్‌నెస్, భద్రతా తనిఖీల అనంతరం బుధవారం మరో 118 జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులకు అనుమతి ఇవ్వడంతో అవి మళ్లీ రోడ్లపైకి వచ్చాయి. దీంతో ఇప్పటికే సేవల్లోకి వచ్చిన బస్సుల సంఖ్య 268కు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్ఆర్టీసీ మొత్తం 500 జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. ఇటీవల బ్యాటరీ అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో జూలై 2న ముందుజాగ్రత్త చర్యగా ఈ బస్సుల సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం ప్రత్యేక సాంకేతిక బృందాలతో ప్రతి బస్సును క్షుణ్ణంగా పరిశీలిస్తూ దశలవారీగా సేవల్లోకి తీసుకొస్తోంది. హైదరాబాద్ బస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీఎస్ఆర్టీసీ సాంకేతిక నిపుణులు, జేబీఎం సంస్థ ఇంజినీర్లు, చైనా నుంచి వచ్చిన బ్యాటరీ నిపుణుల సమక్షంలో బ్యాటరీ వ్యవస్థ, హీట్ మేనేజ్‌మెంట్, వైరింగ్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. భద్రతకు ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఇంకా సేవల్లోకి రాని జేబీఎం బస్సుల స్థానంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా సాధారణ ఆర్టీసీ బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి అన్ని ప్రాంతీయ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన బస్సుల తనిఖీలు కూడా త్వరలో పూర్తి చేసి సేవల్లోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు.



## అమరవీరుల స్ఫూర్తి యాత్రను విజయవంతం చేయండి

### డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట, జూలై 8**

తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) ఏర్పాటై 30 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న అమరవీరుల స్ఫూర్తి యాత్రను విజయవంతం చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 9, 10 తేదీల్లో సూర్యాపేట జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్ఫూర్తి యాత్ర కరపత్రాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ, తెలంగాణలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారం కోసం జీఎం పీఎస్ మూడు దశాబ్దాలుగా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. సంఘం ఉద్యమాల ఫలితంగానే జీవో 55, జీవో 910, జీవో 16 వంటి కీలక ప్రభుత్వ ఉత్తర్వులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. సంఘం 30 ఏళ్ల ప్రస్థానంలో గొర్రెల కాపరుల హక్కుల కోసం పోరాడి అమరులైన ఎనిమిది మంది అమరవీరుల కుటుంబాలను పరామర్శిం చడం అభినందనీయమని అన్నారు. గొర్రెల కాప రులకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేయాలని, ప్రమాదాల్లో మృతి చెందిన కాపరుల కుటుంబా లకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండవానలకు లెక్కచేయకుండా అడవులు, గుట్టలు, పుట్టల్లో గొర్రెల మందలతో జీవనం సాగిస్తున్న కాపరుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలకు మందల వద్దకే పశువైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలకులు మారుతున్నా గొర్రెలు, మేకల పెంపకందా రుల జీవన పరిస్థితు ల్లో ఆశించిన మార్పు రాలేదని పేర్కొంటూ, హక్కుల సాధన కోసం కాపరులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జీఎంపీ ఎస్ మాజీ జిల్లా నాయకులు మట్టిపెల్లి సైదులు అధ్యక్ష తన జరిగిన కార్యక్ర మంలో మాజీ జిల్లా నాయకులు వజ్జా వీరయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల రమేష్, యాదవ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బయ్య మల్లికార్జున యాదవ్, టాప్రా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పులుసు సత్యం, జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కంచుగట్ల శ్రీనివాస్, రజక సంఘం జిల్లా నాయకుడు కూసు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు చేరువగా కొత్త పోలింగ్ కేంద్రాలు

**1200 మంది ఓటర్లు దాటితే అదనపు కేంద్రం -- 2 కి.మీ. దూరం మించితే కొత్త పోలింగ్ స్టేషన్**

**సూర్యాపేట, జూలై 8**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంతో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా, పోలింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల సంఖ్య 1,200 దాటితే అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంటే, ఆ ప్రాంతంలో కొత్త పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా పోలింగ్ కేంద్రాల పేర్ల సవరణ, ప్రదేశాల మార్పు, అవసరమైన చోట కొత్త కేంద్రాల ఏర్పాటు అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్ స్పష్టమైన షెడ్యూల్‌ను ఖరారు చేసిందని తెలిపారు. జూలై 24 నాటికి కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపిస్తామని, కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం జూలై 31న కొత్త కేంద్రాలతో కూడిన డ్రాఫ్ట్ జాబితాను విడుదల చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో నిర్వహించే సమావేశాలకు మండల, నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై తమ సూచనలు, అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సీహెచ్ రాజేశ్వరరావు, సీపీఎం నాయకుడు కోట గోపి, బీఎస్పీ ప్రతినిధి స్టాలిన్, బీజేపీ నాయకులు అజిత్, చల్లమల్ల నరసింహ, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ ప్రతినిధి రమేష్‌తో పాటు ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.





## వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదు

### నూతనకల్ పీహెచ్‌సీ మరమ్మతులకు రూ.14.30 లక్షలు

**సూర్యాపేట, జూలై 8**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)తో పాటు నూతనంగా నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ భవనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన ఏఎన్‌సీ కేసులు, పీహెచ్‌సీలో జరిగిన ప్రసవాలు, గ్రామాల్లో కొనసాగుతున్న ఫీవర్ సర్వే, నమోదైన జ్వర కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనరల్ వార్డు, లేబర్ రూమ్, ఫార్మసీ, మెడికల్ ఆఫీసర్ గది, సమావేశ మందిరాన్ని పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేస్తూ, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడిసిన్ స్టాక్ రిజిస్టర్, ఏఎన్‌సీ రిజిస్టర్, బర్త్ ప్లాన్ రిజిస్టర్లను స్వయంగా పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పీహెచ్‌సీ మరమ్మతులకు రూ.14.30 లక్షలు పీహెచ్‌సీ భవనం పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరమ్మతుల కోసం తక్షణమే రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదనంగా పీహెచ్‌సీ వద్ద ఉన్న రూ.4.30 లక్షల నిధులను కూడా భవన మరమ్మతులకే వినియోగించాలని ఆదేశించారు. వెంటనే జేఏఎస్ సమావేశం నిర్వహించి పనులు ప్రారంభించాలని మెడికల్ ఆఫీసర్, పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ వేణు మాధవరావు, మెడికల్ ఆఫీసర్ ఆశ్రిత రెడ్డి, సీహెచ్‌వో చరణ్, నూతనకల్ తహసీల్దార్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లలో పీపీపీ విధానం రద్దు చేయాలి

### ప్రజల ఆస్తుల వివరాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు

### సీఏఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ



**అమరావతి, జూలై 8**

రిజిస్ట్రేషన్ శాఖలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రతిపాదించిన 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' ఏర్పాటుకు సంబంధించిన ఏపీ ప్రభుత్వం జారీ చేసిన లిలిజీవో ఎంఎస్ నెం.396 (తేదీ: 30-06-2026)లిలిను తక్షణమే రద్దు చేయాలని కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ (సీఏఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారానే నిర్వహించాలని ఆయన కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శికి సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు ఆయన బుధవారం మీడియాకు తెలిపారు. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయాలు, వీలునామాలు, వారసత్వ ఆస్తుల పంపిణీ వంటి అత్యంత గోప్యమైన సమాచారాన్ని ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టడం ప్రజల గోప్యతకు ముప్పుగా మారుతుందని వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల వ్యక్తిగత, ఆర్థిక వివరాల భద్రతపై అనేక సందేహాలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(సి) ప్రకారం ప్రజలపై ప్రభావం చూపే విధాన నిర్ణయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే వెల్లడించాల్సి ఉండగా, ప్రభుత్వం ఎలాంటి ప్రజా చర్చ లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని విమర్శించారు. ప్రస్తుతం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులో ఉన్న పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) విధానం ద్వారా ప్రజలు స్వయంగా డాక్యుమెంట్లను నమోదు చేసుకునే అవకాశం ఇప్పటికే ఉందని గుర్తు చేశారు. అలాంటప్పుడు కొత్తగా ప్రైవేటు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సేవా కేంద్రాల ద్వారా దళారుల ప్రమేయం పూర్తిగా ఉండదనే హామీ ఇవ్వలేమని, ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.2 వేల వరకు అదనపు రుసుము వసూలు చేసే అవకాశం ఉండడంతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు. డాక్యుమెంట్ రైటర్లను ప్రజలు వ్యక్తిగత సహాయకులుగా భావించి తమ వివరాలను వెల్లడిస్తారని, అదే ప్రభుత్వ తరఫున పనిచేసే ప్రైవేటు సంస్థల వద్ద అలాంటి నమ్మకం ఏర్పడకపోవచ్చని పేర్కొన్నారు. ఆస్తుల కొనుగోలు, విక్రయాల్లో ఉండే సున్నితమైన అంశాలను సేవా కేంద్రాల్లో చర్చించడం కూడా సాధ్యం కాదన్నారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలతో రిజిస్ట్రేషన్ సేవలను పోల్చడం సరికాదని వెంకటరమణ అభిప్రాయపడ్డారు. పాస్‌పోర్ట్ సేవల్లో వ్యక్తిగత ధృవీకరణ మాత్రమే ఉంటే, రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, కుటుంబ, ఆర్థిక వివరాలు వంటి అత్యంత సున్నితమైన సమాచారం ఉంటుందని చెప్పారు. అలాంటి సమాచారాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలోని అనేక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు, తగిన సిబ్బంది, మౌలిక వసతులు లేవని పేర్కొంటూ, ముందుగా ప్రభుత్వ కార్యాలయాలను బలోపేతం చేసి అవసరమైన సిబ్బంది, పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను పీపీపీ విధానంలో కాకుండా పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని, ప్రజల గోప్యత, విశ్వసనీయత, ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని వెంకటరమణ కోరారు. అలాగే ఇప్పటికే ఆర్టీసీ ఫిట్‌నెస్ కేంద్రాలను థర్డ్ పార్టీకి అప్పగించిన తప్పిదాన్ని పునరావృతం చేయకుండా, రిజిస్ట్రేషన్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ సేవలను ప్రైవేటుపరం చేసే చర్యలను విరమించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



## పాత బస్టాండ్‌కు బస్సులు వెళ్లాలి

### వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట జులై 9**

సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండుకు వెళ్లి అక్కడ నుండి ప్రయాణికులను తీసుకుని వివిధ గమ్యస్థానాల్లోకి వెళ్లడం చాలా కాలంగా కొనసాగుతున్న ప్రక్రియను ఆర్టీసీ వారు అకస్మాత్తుగా నిలిపివేయడం అన్యాయమని టీఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య యాదవ్ అన్నారు. సూర్యాపేట కొత్త బస్టాండ్ నుండి బయటికి వెళ్లే గేటు దగ్గర ఊళ్లోకి వెళ్లేందుకు ఒక తోవ ఉండేది దాని ద్వారానే పాత బస్టాండుకు శంకర్ విలాస్ సెంటర్ మీదుగా వెళుతుండేవారు కానీ బస్టాండ్ దగ్గర ఆ రోడ్డును మూసివేశారు ఇదే విషయం డిపో మేనేజర్ ను అడిగితే మునిసిపాలిటీ వారు ఆ రోడ్డును ఆపారు అని చెప్పడమే కాక తమకు ఈ విషయం తెలియదని చెప్పడం, తనకి తెలియకుండానే మున్సిపాలిటీ అధికారులు పోలీస్ అధికారులు రోడ్ బంద్ చేశారని చెప్పడం జరిగింది. ఆర్టీసీ బస్సులు ఈరోజు వాడుతున్నది అందరూ నిరుపేదలే సంపన్నులు తమ సొంత వాహనాల ద్వారా ప్రయాణాలు చేస్తున్నారు పేదలు వాడుకుంటున్న ఆర్టీసీ బస్సును వారికి అందుబాటులో లేకుండా చేయడం సమంజసం కాదు అని జానయ్య యాదవ్ డిపో మేనేజర్ తో వివరించారు సత్వరమే పాత బస్టాండ్ వరకు బస్సులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. నల్లగొండ మిర్యాలగూడ లాంటి సెంటర్లకు ఈరోజుకు కూడా చిన్న చిన్న వ్యాపారస్తులు బస్సుల్ని ఆశ్రయిస్తూ తమ జీవితాలను వెలదీస్తున్నారని అందువల్ల అలాంటి వారికి దూరం చేయడం ప్రజల్ని అవమాన పరచడమేనని జానయ్య యాదవ్ మండిపడ్డారు. సూర్యాపేట పాత బస్టాండ్ కు సూర్యాపేట పాత పట్టణంలో ఉన్నవాళ్లు ఇప్పటికీ పాత బస్టాండ్ ఆశ్రయిస్తున్నారని అందువల్ల బస్టాండ్ రద్దు పరచడము లేదా నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని అన్నారు. సూర్యాపేట పట్టణంలో ఉన్న వివిధ రాజకీయ పక్షాలు పాత బస్టాండ్ ను మూసినప్పుడు ఇప్పుడున్న కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. కాంగ్రెస్ వాళ్లు మూసివేస్తే ఇప్పుడున్న ఎమ్మెల్యే పాత బస్టాండ్ ఉండాలని డిమాండ్ చేశాడు తీరా ఆ బస్టాండుకు బస్సులు బంద్ అయితే ఒక్క నాయకుడు కూడా మాట్లాడకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలంటే ఆ పార్టీలు నాయకులకు లెక్క లేదని మరీ ముఖ్యంగా పేదలంటే లెక్కే లేదని జానయ్య యాదవ్ ఆ పార్టీల వైఖరి నిరసించారు.

పేద ప్రజల తరఫున మాట్లాడే తమ పార్టీ పేదలు ఇబ్బందుల్ని గుర్తించగలిగే పార్టీగా మాత్రమే ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని అందుకే సత్వరమే స్పందించి డిపో మేనేజర్ మాట్లాడి పాత బస్టాండుకు అన్ని వాహనాలు అన్ని బస్సులు వెళ్లేలా సత్వరం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ అధికారులు ప్రజా వ్యతిరేకులుగా ఉండకుండా ప్రజలకు అనుకూలంగా ఉండే పద్ధతిని అలవార్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు గారు, నెలచర్ల మధు ప్రజాపతి, కాంటేకార్ రఘు మోహన్, దేశబోయిన సురేష్, వట్టె లింగరాజు, అబ్దుల్ భారీ ఖాన్, గుంటూరు విజయ్, కోటి, గుగులోతు సుమన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

## స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

- జాతీయ రహదారి పక్కన ఫుడ్ స్టాల్ సందర్శన
- చిన్న వ్యాపారుల సమస్యలపై ఆరా
- ప్రభుత్వ పనితీరుపై వ్యాపారి అభిప్రాయం
- బీఆర్ఎస్ సభ్యత్వ కార్యక్రమానికి వెళ్తూ సందర్శన




**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 08**

అందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎస్ఐఆర్ అవగాహన, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంగారెడ్డి శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ స్ట్రీట్ ఫుడ్ స్టాల్‌ను సందర్శించి వ్యాపారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. రోజువారీ వ్యాపారం, ఆదాయం, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకుంటూ చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా తన ఫుడ్ స్టాల్‌కు ఎమ్మెల్యే రావడం ఆనందంగా ఉందని వ్యాపారి పేర్కొనగా, అనంతరం ప్రభుత్వ పనితీరుపై ఎమ్మెల్యే అభిప్రాయం కోరగా, ప్రస్తుత ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అంచనాలను అందుకోలేకపోయిందని, గతంలో కేసీఆర్ పాలనలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మేలు చేశాయని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, లాడే మల్లేశం, మసూద్, శ్రవణ్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

- విగ్రహానికి నివాళులర్పించిన కూన శ్రీశైలం గౌడ్
- షాపూర్ నగర్‌లో జయంతి కార్యక్రమం
- వైఎస్సార్ సంక్షేమ పాలనకు నివాళి
- రైతులు, పేదల కోసం అమలు చేసిన పథకాల ప్రస్తావన
- భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు



**మేడ్చల్--మల్కాజ్గిరి ప్రతినిధి, జూలై 08**

మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లాలోని షాపూర్ నగర్ చౌరస్తాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, 108 ఉచిత అంబులెన్స్ సేవలు వంటి ప్రజోపయోగ సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేతగా వైఎస్సార్ గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సర్వే శాఖ సూపరింటెండెంట్

**మహబూబ్‌నగర్, జులై 8**



మహబూబ్‌నగర్ జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకుడి కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ బొమ్మిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ అధి కారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన గ్రామానికి సంబంధించిన గ్రామ మ్యాప్‌లో సవరణలు చేపట్టేందుకు సంబం ధిత ఫైల్‌ను సహాయ సంచాల కుడి వద్దకు పంపించేందుకు అధికారిక అనుకూలం చేస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి సూపరింటెండెంట్ రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు.



## బేటీ బచావో--బేటీ పడావోతో విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన

- ఝరాసంగం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం
- బాల్య వివాహాలు, పోక్సో, పోష్ చట్టాల వివరణ
- మహిళల భద్రత, సోషల్ మీడియాపై సూచనలు
- విద్య, సాధికారత ప్రాధాన్యంపై అవగాహన

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 08**

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బేటీ బచావో--బేటీ పడావో (బీబీబీపీ) కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కె. లలిత కుమారి బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, పోష్ చట్టం, పోక్సో చట్టం, మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన హెల్ప్ లైన్ నంబర్లు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల ప్రాముఖ్యత, విద్య అవసరం, మహిళల భద్రత, సాధికారతపై సమగ్ర అవగాహన కల్పించారు.

సమాజంలో బాలికల రక్షణ, విద్యాభివృద్ధి, హక్కుల పరిరక్షణపై విద్యార్థినులు చైతన్యవంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ, డీసీపీవో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త, మెడికల్ ఆఫీసర్, సఖి కేంద్రం ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పోలీసు శాఖ సిబ్బంది, జెండర్ స్పెషలిస్ట్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# గంభీర్, అగార్కర్‌పై అభిమానుల ఆగ్రహం

**లండన్, జూలై 8, 2026**

ఇంగ్లండ్ చేతిలో టీమిండియా ఎదుర్కొన్న ఘోర పరాజయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఓటమికి ఆటగాళ్ల కంటే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చేపట్టిన ప్రయోగాలే కారణమంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రయోగాల పేరుతో జట్టును సంక్షోభంలోకి నెడుతున్నారని, ఆటగాళ్లను మార్చే ముందు కోచ్ గంభీర్, సెలక్టర్ అగార్కర్‌లను బాధ్యతల నుంచి తప్పించాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. మ్యాచ్‌లో తిలక్ వర్మ కంటే ముందు అక్షర్ పటేల్‌ను, శివమ్ దూబే కంటే ముందు నితీష్ కుమార్ రెడ్డిని బ్యాటింగ్‌కు పంపడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అనాలోచిత నిర్ణయాల వల్లే జట్టు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని అభిమానులు మండిపడుతున్నారు. మరోవైపు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రదర్శన కూడా తీవ్ర విమర్శలకు గురైంది. కెప్టెన్‌గా కీలక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో పాటు, బ్యాటర్‌గా కూడా విఫలమవడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంభీర్--అగార్కర్ కలయికలో జరుగుతున్న వరుస ప్రయోగాలు, జట్టులో స్థిరత్వం లేకపోవడం టీమిండియా వరుస పరాజయాలకు ప్రధాన కారణమని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన ఈ ఓటమి అనంతరం జట్టు మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీ పనితీరుపై అసంతృప్తి మరింత పెరిగింది. రాబోయే సిరీస్‌ల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే జట్టు ఎంపిక, వ్యూహాల్లో తక్షణ మార్పులు అవసరమని క్రీడా విశ్లేషకులు సూచిస్తున్నారు.

# పెనాల్టీల్లో స్విస్ విజయం

## క్వార్టర్స్‌లో అర్జెంటీనాతో పోరు

**కాన్సాస్ సిటీ, జూలై 8, 2026**

ఫిఫా ప్రపంచకప్ రౌండ్-16లో మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్‌లో కొలంబియాపై 4-3 గోల్స్ తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. నిర్ణీత సమయం, అదనపు సమయంలో ఇరు జట్లు గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు వెళ్లింది. అక్కడ స్విట్జర్లాండ్ పైచేయి సాధించి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విస్ జట్టులో సంబరాలు వెల్లివిరిశాయి. ఈ విజయంతో స్విట్జర్లాండ్ క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారం మిస్సోరీ రాష్ట్రంలోని కాన్సాస్ సిటీలో జరగనుంది. ప్రపంచకప్ చరిత్రలో 1954 తర్వాత తొలిసారి స్విట్జర్లాండ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోవడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటికే రెండు గోల్స్ చేసిన రూబెన్ వర్గాస్ స్టాపేజ్ టైంలో మైదానంలోకి వచ్చి పెనాల్టీ షూటౌట్‌లో జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు.

మరోవైపు కొలంబియా ఆటగాళ్లు డేవిన్‌సన్ సాంచెజ్, కూచో హెర్నాండెజ్ తమ పెనాల్టీలను గోల్‌గా మలచడంలో విఫలమవడంతో స్విట్జర్లాండ్‌కు విజయం సులభమైంది. ఈ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌కు కీలక ఆటగాడు జోహన్ మంజంబీ మోకాలి గాయం కారణంగా దూరమయ్యాడు. ప్రధాన అటాకర్ లేకపోవడంతో స్విస్ జట్టు కొంత ఇబ్బంది పడినప్పటికీ, చివరకు పెనాల్టీ షూటౌట్‌లో ఒత్తిడిని జయించి క్వార్టర్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది.



# ఐపీఎల్ పిచ్‌లు కావు..

**లండన్, జూలై 8, 2026**

భారత్‌పై మూడో టీ20లో ఘన విజయం సాధించిన అనంతరం ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఐపీఎల్‌లోని పిచ్‌లు బ్యాటర్లకు అనుకూలంగా ఉంటాయని, ఇంగ్లండ్ లో మాత్రం పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అదే భారత బ్యాటర్లకు ఇబ్బందిగా మారిందని పరోక్షంగా వ్యాఖ్యానించారు. మూడో టీ20లో ఆర్చర్ మూడు వికెట్లు పడగొట్టగా, జోష్ టంగ్ నాలుగు వికెట్లతో మెరిశాడు. 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌటై, టీ20 చరిత్రలో పరుగుల పరంగా తమ అతిపెద్ద ఓటమిని నమోదు చేసింది. మ్యాచ్ అనంతరం ఆర్చర్ మాట్లాడుతూ, ఐపీఎల్‌లో బౌలింగ్ చేయడం కంటే ఇంగ్లండ్‌లో బౌలింగ్ చేయడం సహజంగా అనిపిస్తుందని చెప్పాడు. భారత్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో పాటు బౌ ండరీలు కూడా చిన్నవిగా ఉంటాయని, అందువల్ల బౌలర్లు అత్యంత కచ్చితత్వంతో బంతులు వేయాల్సి వస్తుందని వివరించాడు.







# క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఎనిమిది జట్లు

**:ఫిఫా ప్రపంచకప్--2026 రౌండ్--16 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిశాయి. ఆఖరి నిమిషాల్లో నమోదైన గోల్స్, అనూహ్య ఫలితాలు, దిగ్గజ ఆటగాళ్ల భావోద్వేగ వీడ్కోళ్లతో ఈ దశ అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోసం జరుగుతున్న పోరు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ దశలో అతిపెద్ద సంచలనంగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. న్యూజెర్సీలో జరిగిన మ్యాచ్‌లో నార్వే 2--1 తేడాతో బ్రెజిల్‌ను ఓడించింది.**

**అట్లాంటా, జూలై 8, 2026**

ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోసం జరుగుతున్న పోరు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ దశలో అతిపెద్ద సంచలనంగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. న్యూజెర్సీలో జరిగిన మ్యాచ్‌లో నార్వే 2--1 తేడాతో బ్రెజిల్‌ను ఓడించింది. నార్వే స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్ చేసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈ ఓటమితో బ్రెజిల్ స్టార్ నెయ్మర్ తన చివరి ప్రపంచకప్‌ను నిరాశతో ముగించాడు. మరోవైపు పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ ప్రయాణం కూడా ముగిసింది. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి నిమిషంలో మైకెల్ మెరినో చేసిన గోల్‌తో పోర్చుగల్ 1--0 తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా అద్భుత పునరాగమనంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2--0తో వెనుకబడిన అర్జెంటీనా, కెప్టెన్ లియోనెల్ మెస్సీ స్ఫూర్తిదాయక ఆటతో కేవలం 13 నిమిషాల్లో మూడు గోల్స్ చేసి 3--2తో సంచలన విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో మొరాకో కెనడాపై విజయం సాధించి చివరి ఎనిమిది జట్లలో చోటు దక్కించుకుంది. ఫ్రాన్స్ మాత్రం పరాగ్వేపై తీవ్ర పోరాటం అనంతరం కైలియన్ ఎంబాపె పెనాల్టీ గోల్‌తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. వివాదాల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో బెల్జియం అమెరికాను 4--1 తేడాతో చిత్తు చేసింది. కొలంబియాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఇప్పుడు ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్స్‌లో మిగిలిన ఎనిమిది జట్లు టైటిల్ కోసం హోరాహోరీ పోరుకు సిద్ధమయ్యాయి.




# మెస్సీ--ఈజిప్ట్ కోచ్ మధ్య వాగ్వాదం

**ఫిఫా ప్రపంచకప్-2026 టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతుండగా, అత్యధిక గోల్స్ సాధించే ఆటగాడికి ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బూట్ అవార్డు కోసం పోటీ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీ, కెనడా స్టార్ జోనాథన్ డేవిడ్ ఈ రేసులో ముందంజలో కొనసాగుతున్నారు.**

**అట్లాంటా, జూలై 8, 2026,**

ఫిఫా ప్రపంచకప్ ప్రిక్వార్టర్ పోరు ముగిసిన తర్వాత అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, ఈజిప్ట్ ప్రధాన కోచ్ హోసమ్ హసన్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో అర్జెంటీనా విజయం సాధించిన అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే టచ్‌లైన్ వద్ద మెస్సీ, హోసమ్ హసన్ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఈజిప్ట్ కోచ్ ఆగ్రహంతో రెండు చేతులను 'ఎక్స్' ఆకారంలో చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈజిప్ట్ కోచింగ్ సిబ్బందిలోని ఓ సభ్యుడు మెస్సీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, మ్యాచ్ అధికారులు అతడికి రెడ్ కార్డు చూపించారు. వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు మెస్సీని చుట్టుముట్టగా, భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే మెస్సీ, హసన్ మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు. మ్యాచ్ అనంతరం హోసమ్ హసన్ చేసిన 'ఎక్స్' సంకేతంపై వివాదం నెలకొంది. మెస్సీని ఉద్దేశించి జాతి వివక్షకు సంబంధించిన వ్యాఖ్యలు లేదా సంకేతాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, ఆ సంకేతం అర్థంపై దర్యాప్తు కొనసాగుతోందని ఫిఫా, ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం తెలిపాయి. అవసరమైతే ఫిఫా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. మ్యాచ్‌లో తొలిఅర్ధంలో రెండు గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచిన ఈజిప్ట్, చివరి నిమిషాల్లో వరుసగా మూడు గోల్స్ సమర్పించుకోవడంతో 3-2 తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఈజిప్ట్ కోచ్, మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. తమ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ, ఈ ప్రపంచకప్‌లో మిగిలిన మ్యాచ్‌లను తాను చూడబోనని వ్యాఖ్యానించారు.



## చదువుకోసమే 'శ్యామ్ సింగరాయ్' ఛాన్స్ వదులుకున్నా

**ప్రస్తుతం 'ఇడుపు కాయితం' చిత్రంతో కథానాయికగా పరిచయం కానున్న నటి నాగ దుర్గ, ఒకప్పుడు స్టార్ హీరో నాని నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమాలో నటించే అవకాశాన్ని చదువు కోసం వదులుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల తమిళ చిత్రం 'లవ్ ఓ లవ్' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని పంచుకున్నారు.**

డిగ్రీ చదువుతో పాటు జర్నలిజం కోర్సు చేస్తున్న సమయంలో 'శ్యామ్ సింగరాయ్'లో సాయి పల్లవి స్నేహితురాలి పాత్రకు అవకాశం వచ్చిందని, పరీక్షలు ఉండటంతో ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని నాగ దుర్గ తెలిపారు. విద్య తన జీవితంలో ఎంతో ముఖ్య మని, అందుకే చదువుకు ఆటంకం కలిగించే సినిమా అవకాశాలను అంగీకరించలేదని చెప్పారు. ఇదొక్కటే కాకుండా మరికొన్ని అవకాశా లను కూడా ఇదే కారణంతో తిరస్కరించినట్లు వెల్లడించారు. కూచిపూడి నర్తకిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాగ దుర్గ, తర్వాత జానపద నృత్యం వైపు అడుగులు వేశానని తెలిపారు. ఫోక్ డ్యాన్స్ ద్వారా తనకు మరింత గుర్తింపు లభి ంచిందని, సోషల్ మీడియా వల్ల జానపద కళలకు మంచి ఆదరణ పెరిగిందని చెప్పారు. సినిమాల ఎంపిక విషయంలో తాను ఒక ప్రత్యేక సూత్రాన్ని పాటిస్తానని నాగ దుర్గ తెలిపారు. ప్రతి సినిమా ప్రేక్షకులకు ఏదో ఒక మంచి సందేశాన్ని అందించేలా ఉండాలని భావిస్తానని చెప్పారు. తాను నటించిన 'కలివనం' మంచి సందేశంతో రూపొందిందని, ఇటీవల విడుదలైన 'ఇడుపు కాయితం' కూడా సమాజానికి ఉపయోగపడే అంశాన్ని చెప్పే చిత్రమని వెల్లడించారు.



# సెప్టెంబరులో 'ఓజీ 2' సందడి

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ 2' చిత్రంపై సంగీత దర్శకుడు ఎస్. థమన్ ఆసక్తికరమైన సంకేతం ఇచ్చారు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించనున్న ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, థమన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి.**

గత ఏడాది దసరా సందర్భంగా విడుదలైన 'ఓజీ' గ్యాంగ్‌స్టర్ యాక్షన్ చిత్రంగా ఘన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ సినీ జీవితంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ విజయంతోనే చిత్రబృందం 'ఓజీ 2'ను అధికారికంగా ప్రకటించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికగా 'ఓజీ' విశ్వాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. దర్శకుడు సుజీత్‌తో మరోసారి కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని నిర్మాణ సంస్థ కూడా స్పష్టం చేసింది. దీంతో సీక్వెల్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో జరిగిన 'హృదయం మురళి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న థమన్‌ను అభిమానులు "ఓజీ... ఓజీ..." అంటూ నినాదాలతో పలకరించారు. దీనికి స్పందించిన ఆయన "సెప్టెంబరులో కలుద్దాం" అని ఒక్క మాట చెప్పడంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. థమన్ వ్యాఖ్యల నేపథ్యంలో సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 'ఓజీ 2' తొలి చూపు, ప్రచార వీడియో, శీర్షిక ప్రకటన లేదా మరో ప్రత్యేక సమాచారం విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ థమన్ వ్యాఖ్యలతో 'ఓజీ 2'పై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

# 'కాంతార'కు మరో అధ్యాయం



భారతీయ సంస్కృతి, జానపద సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన 'కాంతార' చిత్రానికి మరో కొత్త అధ్యాయం రానుంది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి ప్రపంచ వ్యాప్తంగా ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తర్వాత వచ్చిన 'కాంతార: చాప్టర్ 1' కూడా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందింది. ఈ రెండు చిత్రాల్లో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన రిషబ్ శెట్టి తాజాగా అభిమానులకు మరో శుభవార్త చెప్పారు. 'కాంతార' కథ ఇక్కడితో ముగియదని, మరో భాగాన్ని తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిషబ్ శెట్టి మాట్లాడుతూ, ప్రస్తుతం తాను ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న 'జై హనుమాన్' చిత్రంతో పాటు 'కాంతార: చాప్టర్ 2' కథపై కూడా సమాంత రంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. రచయితల బృందంతో కలిసి కథను అభివృద్ధి చేస్తున్నామని, ఈ చిత్రం కోసం ప్రత్యేక సమయం కేటాయిస్తు న్నామని తెలిపారు. దీంతో 'కాంతార' ఫ్రాంచైజీకి మరో భాగం ఖాయమవడంతో అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దర్శకత్వంపై తన కున్న మక్కువ గురించి రిషబ్ శెట్టి మాట్లాడారు. నటుడిగా ఎంత బిజీగా ఉన్నా దర్శకత్వాన్ని మాత్రం ఎప్పటికీ వదిలిపెట్టనని స్పష్టం చేశారు. దర్శకత్వం చేస్తేనే తనకు నిజమైన ఆనందం, మన శ్శాంతి లభిస్తాయని, కొత్త కథలపై రచయి తల బృందంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## 'రాకా'లో అవకాశం కోల్పోయిన ప్రీతీ



స్టార్ హీరో అల్లు అర్జున్, బాలీవుడ్ నటి దీపికా పదుకోణె జంటగా దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం లిలి'రాకా'లిలిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ నిర్మాణ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం గురించి వస్తున్న ప్రతి వార్త సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని దర్శకుడు అట్లీ వెల్లడించారు. యువ నటి ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లోని ఒక కీలక పాత్ర కోసం సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ పాత్రను చేయలేకపోయారని అట్లీ తెలిపారు. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో ప్రీతీ ముకుందన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అంతకుముందు 'కన్నప్ప' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. ప్రస్తుతం పలు భాషల్లో వరుస అవకాశాలతో ఆమె బిజీగా ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న అట్లీ మాట్లాడుతూ, ప్రీతీ ముకుందన్‌ను ఈ చిత్రంలో నటింపజేయాలని భావించామని, అయితే ఆమె ముందే ఇతర చిత్రాలకు అంగీకరించడంతో తేదీలు కుదరకపోయాయని వివరించారు. ప్రీతీ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్‌కు అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా జార్జ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అల్లు అర్జున్--అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. హై వోల్టేజ్ యాక్షన్, అత్యున్నత నిర్మాణ విలువలు, అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ సరసన దీపికా పదుకోణె నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది.

## ఓటీటీలోకి వచ్చిన 'సింగ్ గీతం'




ప్రయోగాత్మక చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన మ్యూజికల్ ఫాంటసీ చిత్రం 'సింగ్ గీతం' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరిస్తోంది. వాస్తవానికి ఈ చిత్రం జూలై 9 నుంచి ప్రసారమవుతుందని ప్రకటించినప్పటికీ, నిర్ణయించిన తేదీ కంటే ఒక రోజు ముందుగానే ప్రముఖ ఓటీటీ వేదికలో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో వీక్షణకు అందుబాటులో ఉంది.

# 'నాగబంధం'కు చల్లని స్పందన

సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాల నేపథ్యంలో తెరకెక్కిన సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేక పోతోంది. సుమారు రూ.100 కోట్ల భారీ వ్యయంతో దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన ఈ చిత్రం జూలై 3న ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, బలహీనమైన కథనం, నెమ్మదైన స్క్రీన్‌ప్లే, ఎక్కువ నిడివి కారణంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైంది. విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. భక్తి, పురాణాల నేపథ్యంలో రూపొందినప్పటికీ, కథలో కొత్తదనం లేకపోవడం వల్ల ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయి ఆదరణ లభించలేదని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2,100 థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తొలి మూడు రోజుల్లో దేశీయంగా కేవలం రూ.9.75 కోట్ల నికర వసూళ్లు మాత్రమే సాధించింది. విదేశీ వసూళ్లతో కలిపి తొలి వారాంతానికి ప్రపంచవ్యాప్తంగా రూ.13.70 కోట్ల నుంచి రూ.15 కోట్ల మధ్య మాత్రమే వసూళ్లు నమోదైనట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో ఉంచుకుని చిత్ర నిడివిని దాదాపు 20 నిమిషాలు తగ్గించినప్పటికీ, పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని సమాచారం.



ఈ చిత్రంలో జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. భక్తి, పురాణాల నేపథ్యంలో రూపొందినప్పటికీ, కథలో కొత్తదనం లేకపోవడం వల్ల ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయి ఆదరణ లభించలేదని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467